## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

కామేపల్లి: కామేపల్లిలో శ్రీరామ నగర సంకీర్తన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముడి అక్షింతలను కామేపల్లి,రామకృష్ణాపురం పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. అవధూతేంద్ర భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, నాగుబండి హనుమంతరావు, శ్రీనివాసచారి, సైదులు, నరసింహారావు, జర్పుల రామారావు, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, పోలూరి రామచంద్రయ్య, పాల్గొన్నారు.

### మంత్రి తుమ్మలను కలిసిన జానకీరామయ్య

నేలకొండపల్లి: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకీరామయ్య హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. అనంతరం పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### చర్యలు తప్పవు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి వద్ద శుక్రవారం మితిమీరిన వేగంతో పాటు సైలెన్సర్‌తో ఇష్టానుసారంగా బైక్‌ను ఓ యువకుడు నడపడంతో స్థానిక ఎస్సై బొల్లగాని సతీష్ ఆ బైక్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాడు. ఈ సందర్భంగా బైక్ సైలెన్సర్‌ను తొలగించి యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత రోడ్లపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: రాష్ట్ర స్థాయి అండర్ -19 క్రికెట్ పోటీలకు రఘునాథపాలెం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని శుక్రవారం పాఠశాల ప్రత్యేక అధికారి వై.లత తెలిపారు. ఈనేపథ్యాన విద్యార్థినులను ఎస్సీఎఫ్ సెక్రటరీ నరసింహమూర్తి, ఉమెన్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ.మతిన్, కోచ్ శివ అభినందించారు.

### 'న్యూఇరా'లో మాక్ పోలింగ్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కాగా, స్కూల్ పీపుల్స్ లీడర్‌గా టి.మనీశ్, అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్‌గా డి.రుచిత ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఇక నుంచి కూలీ రూ.300

నేలకొండపల్లి: మండలంలోని వ్యవసాయ కూలీలు తమకు కూలీ రేట్లు పెంచాలని గత వారంరోజుల నుంచి కూలీలు రైతుల పొలాల పనులకు వెళ్లకుండా సమ్మె చేపట్టారు. దీంతో శుక్రవారం కూలీలు, రైతులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి విచారించి రోజుకు రూ.300 ఇచ్చేలా ఒప్పదం కుదుర్చుకున్నారు.

### ఏఐసీసీ సెక్రటరీని కలిసిన దుర్గాప్రసాద్



రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ పర్సనల్ అడ్వైజర్, ఏఐసీసీ సెక్రటరీ కొప్పుల రాజును ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదగాని దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోతున్న ఆరు గ్యారంటీలు, ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలుపై కొప్పుల రాజుతో మాట్లాడానని దుర్గాప్రసాద్ తెలిపారు.

### 'తొలిమెట్టు'ను పటిష్టంగా అమలు చేయాలి

కామేపల్లి: తొలిమెట్టు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని మండల నోడల్ అధికారి బుగ్గినేని నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం గరిడేపల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలు, ఉపాధ్యాయుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు జర్పల దేవాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడదూరం..



కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

**అభివృద్ధికి నోచుకోని కాల్వొడ్డు-త్రీటౌన్ పోలీస్ స్టేషన్ రహదారి**

- 23 ఏళ్ల క్రితం అభివృద్ధి పనులు
- ఆంజనేయస్వామి గుడివద్ద కాల్వలు అధ్వానం
- పైకప్పు నిర్మాణాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



త్రీటౌన్ పోలీసు స్టేషన్ మూలమలుపు వద్ద ధ్వంసమైన రోడ్డు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్‌లో ఉన్న కాల్వొడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వైపునకు ఉన్న ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాలుగా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. 35వ డివిజన్ పరిధిలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాత లారీ ఆఫీస్, మోతేనగర్, వెంకటలక్ష్మి టాకీస్, అంబేడ్కర్‌కాలనీ నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వైపునకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. పాలకులు మారుతున్నా.. ఈ రోడ్డు పరిస్థితి మారడం లేదు. అరకొరగా అక్కడక్కడ డ్రెయిన్లు నిర్మిస్తున్నారే తప్పా.. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను పరిష్కరించడం లేదు.

**రహదారి అభివృద్ధికి 23 ఏళ్లు..**

కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పాత లారీ ఆఫీస్ వరకు ఉన్న రహదారి కంకర లేచి గుంతలమయంగా తయారైంది. రహదారికి అడ్డంగా పలుచోట్ల గోతులు తీయడంతో పాటు మూలమలుపుల వద్ద ఉన్న పెద్ద గోతుల కారణంగా రాత్రి వేళల్లో పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 23 ఏళ్ల క్రితం ఈ రహదారి అభివృద్ధి పనులు జరుగగా.. నాటి నుంచి దీన్ని పట్టించుకున్నవారే లేరు. గాంధీచౌక్, పొట్టి శ్రీరాములు, కాల్వొడ్డు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వంటి వ్యాపార ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎక్కువ శాతం వాహనాలు పొట్టి శ్రీరాములు రోడ్, మోతేనగర్ రహదారుల గుండా వెళ్లడంతో అనునిత్యం రద్దీ సమస్య నెలకొంటుంది. ఈ రహదారిని అభివృద్ధి చేస్తే ప్రధానంగా వివిధ ప్రాంతాల నుంచి కాల్వొడ్డు మీదుగా గాంధీచౌక్, వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే వారికి ప్రయోజకరంగా ఉండడంతో పాటు రద్దీ సమస్య కూడా తగ్గుతుంది.

**ప్రమాదకరంగా డ్రెయిన్..**

కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయానికి ఆనుకొని పెద్ద డ్రెయినేజీ ఉంది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వెళ్లే లారీలు, ట్రాక్టర్లు ఆ డ్రెయిన్ అంచుల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నాయి. గోళ్లపాడు చానెల్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయం వెంట కూడా డ్రెయిన్ అభివృద్ధి చెందుతుందని భావించిన స్థానికులకు నిరాశే మిగిలింది. ఫలితంగా డ్రెయిన్‌లో మురుగు చేరి దుర్గంధం వెదజల్లడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక ప్రాంతంలో ఉన్న వ్యాపార సంస్థలు కూడా చెత్తాచెదారాన్ని ఈ డ్రెయినేజీలోనే పడేస్తుండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక దోమలు, ఈగలతో ఈ ప్రాంత వాసులు, ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

**అభివృద్ధి చేస్తే రద్దీ తగ్గుతుంది..**



కాల్వొడ్డు నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. గత 20 ఏళ్లకు పైగా అభివృద్ధికి నోచుకోవటం లేదు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే ఆయా రహదారులతో పాటు పొట్టి శ్రీరాములు రోడ్, గాంధీచౌక్ రోడ్, వ్యవసాయ మార్కెట్ వెళ్లే మార్గాలకు రద్దీ తగ్గుతుంది.

– బజ్జూరి రమణారెడ్డి, స్థానికుడు

**పాలకులు పట్టించుకోవాలి..**



ఆంజనేయస్వామి ఆలయం వద్ద డ్రెయిన్, ఈ ప్రాంతంలోని రహదారి అధ్వానంగా ఉన్నాయి. డ్రెయిన్ పై కప్పు లేకపోవడంతో ప్రజలు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకొని రహదారి అభివృద్ధి, డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, స్థానికుడు

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గంలో జీఓ నంబర్ 59 ద్వారా ప్రభుత్వ భూములను రెగ్యులరేషన్ పేరుతో అక్రమార్కులకు పాల్పడిన వారిపై, రెగ్యులరైజ్ చేసిన అధికారులపై చర్యలకు తీసుకోవాలని సీపీఎం జిల్లా పార్టీ ఆధ్వర్యాన కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆనాటి అధికార పార్టీని అడ్డం పెట్టుకొని, కొందరి ఉద్యోగస్తుల సహకారంతో తప్పుడు పద్ధతిలో భూములను రెగ్యులరైజ్ చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి వాటిని రద్దు పరచాలని, సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్ చొరవ తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.విక్రం, యర్రా శ్రీనివాసరావు, ఎం. ఎ. జబ్బార్, దొంగల తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్, బత్తిని ఉపేందర్ తదితరులు ఉన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.విశ్వకర్మ యోజన పథకాన్ని విస్తతంగా ప్రచారం చేయాలని కోరారు. పార్టీ నాయకులు భువనాసి దుర్గారావు, కోటి హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, పాగర్తి సుధాకర్, కాలంగి వెంకటేశ్వర్లు, మెహినుద్దీన్, మీగడ గోప, వెంకటరమణ, రాధాకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించే రెండో ప్రపంచ తెలుగు మహాసభల గోడ పత్రికను శుక్రవారం నగరంలోని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహాసభల తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, సాహితీవేత్తలు రెంటాల చిన్న హుస్సేన్, మలిశెట్టి కృష్ణమూర్తి, రేళ్ల శ్రీనివాస్, శోభనాద్రి, వీరభద్రం, గమ్మిడి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'సర్వజ్ఞ'లో అవగాహన..




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో డ్రై వేస్ట్ రీ సైక్లింగ్‌పై ఐటీసీ సర్వజ్ఞ ఆధ్వర్యాన ఇంటర్ స్కూల్ రీ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా వెల్ బీయింగ్ అవుట్ వేస్ట్ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు మాట్లాడుతూ.. పుస్తకాలు, పేపర్లు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ సంబంధిత కవర్లు, బ్యాగ్ తదితరాలు సేకరించి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్స్‌లు, రబ్బర్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, జాగృతి నిర్వాహకులు ఎం.కుముదిని, మాధవి, రాజేశ్, హలీమ్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్య ప్రార్థనకు ధనుర్మాసం అనువైనది

ఖమ్మంగాంధీచౌక్: ధనుర్మాసం ఎంతో విశిష్టమైనదని, దివ్య ప్రార్థనలకు అనువైనదని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించి, భక్తులనుద్దేశించి ప్రవచనాలు వినిపించారు. ప్రతి ఒక్కరూ భగవంతుడి వైపు విశ్వాసం ఉంచి జీవితాన్ని సాగించాలన్నారు. ధనుర్మాసం మొత్తం సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేయాలని చెప్పారు. కొత్తూరు జగన్మోహన్‌రావు, పోలా శ్రీనివాస్, మధుసూదన్‌రావు, యాదగిరి, వెంకటనారాణ, పావని, నర్మద, ఉషాకన్య, నాగమణి పాల్గొన్నారు.

**శ్రీరంగనాథుడికి మొక్కులు..**

నగరంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి ఆలయాన్ని ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్రిదండి దేవనాథ జీయర్ స్వామి దర్శించుకున్నారు. కార్యక్రమంలో బూరుగడ్డ శ్రీధరాచార్యులు, ఆచార్య సందీప్, పోలా శ్రీనివాస్, తూములూరి లక్ష్మీనరసింహారావు, రుద్రగాని శ్రీదేవిఉపేందర్, సతీశ్, భద్రయ్య, రాము పాల్గొన్నారు.

### వైభవంగా ఇరుముడి

కామేపల్లి: అయ్యప్ప మాలధారులు ఇరుముడి కార్యక్రమాన్ని శుక్రవారం ముచ్చర్లలోని రామాలయంలో గురుస్వామి బత్తుల సీతారాములు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో మేళతాళాలు, బాణాసంచా కాల్చి ప్రదర్శనగా శబరిమలై బయలుదేరారు.

### విగ్రహావిష్కరణ..

నేలకొండపల్లి/కూసుమంచి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, గ్రేటర్ నేలకొండపల్లి, వనిత భక్త రామదాసు వారి ఆధ్వర్యాన నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాలలో సరస్వతి, నేలకొండపల్లి ఉన్నత పాఠశాలలో గాంధీ, జ్ఞాన సరస్వతీ విగ్రహాలను, అలాగే వాసవీ క్లబ్, కూసుమంచి ఆధ్వర్యాన జక్కేపల్లి ఎస్సీ కాలనీలోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుక్రవారం క్లబ్ జిల్లా గవర్నర్ దోసపాటి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, గ్లూకోవీటాను సుగుణ బేకరి ప్రతినిధి మాటూరి సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. గురుకుల పాఠశాలలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.10 వేలను గవర్నర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోరట్లగూడెం ఎంపీటీసీ రేగూరి వాసవీ, కేబినెట్ సెక్రటరీ దారా మల్లిఖార్జున్‌రావు, రేగూరి హనుమంతరావు, చారగుండ్ల స్వాతి, నరసింహారావు, వైస్ గవర్నర్ గుమ్మడపల్లి శ్రీనివాస్, రాధాకృష్ణ, గోపగాని రమేష్, దోసపాటి చంద్రశేఖర్, కిశోర్, రామకృష్ణ, సత్యనారాయణ, స్వాతి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామంలో కానుక మాత నూతన దేవాలయం (చర్చి) నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ఫాదర్లు తాళ్ల లాజరు, దామాల సురేశ్, సర్పంచ్ వాంకుడోత్ విజయదీపక్, సొసైటీ చైర్మన్ మందడపు సుధాకర్, గ్రామ పెద్దలు మందడపు మాధవరావు, మందడపు నరసింహారావు, వార్డు సభ్యులు పాల్గొని శంకుస్థాపన చేశారు. కాగా, ఈ చర్చి నిర్మాణానికి సుమారు రూ.1.20 కోట్లకు పైగా ఖర్చవుతుందని, దాతలు విరాళాలు అందించాలని నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

### ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: కాలేయ వ్యాధితో బాధపడుతున్న యువతి వైద్య చికిత్స నిమిత్తం వీఆర్ విత్‌యూ సేవా సంస్థ శుక్రవారం ఆర్థిక సాయం అందజేసింది. నగరంలోని కేసీఆర్ టవర్స్‌కు చెందిన దొడ్డ సిరి కాలేయ వ్యాధితో బాధపడుతూ.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్సకు అవసరమైన నగదు లేకపోవడంతో దాతల సహకారం కోసం ఎదురు చూడగా.. వీఆర్ విత్‌యూ సేవా సంస్థ రూ.42 వేలు సేకరించి సిరి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ విత్‌యూ ఆర్గనైజర్ బోస్ యాదవ్, సాయి యాదవ్, శ్రీకాంత్, నజీర్, రాము తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందజేస్తున్న జనం

## ఆరు గ్యారంటీల కోసం అగచాట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం ఇందిరమ్మ అభయహస్తం పేరిట నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ నేపథ్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్రాలను సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్



తిరుమలాయపాలెం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్, జెడ్పీటీసీ శ్రీనివాస్



కామేపల్లి: జాస్తిపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో దరఖాస్తులను పూర్తి చేస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ



ఖమ్మంరూరల్: ఆరెంపుల గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఖమ్మంఅర్బన్: 3వ డివిజన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, కార్పొరేటర్ జగన్

### పల్లెల్లో దరఖాస్తుల లొల్లి..



మాట్లాడుతున్న డీసీఓ విజయకుమారి

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: నగరంతో పాటు పల్లెల్లో ప్రజాపాలనకు విశేష స్పందన లభిస్తోంది. నగరంలో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి స్థిరపడడం, గ్రామాల్లో కుటుంబాల సంఖ్యకు మించి దరఖాస్తులు రావడంతో కేంద్రాల వద్ద దరఖాస్తుల కోసం లొల్లి మొదలైంది. రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లిలో దరఖాస్తులు అందలేదని కేంద్రం వద్ద కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన వారు అత్యధికంగా ఇంటి నిర్మాణం కోసం, విద్యుత్ రాయితీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు మండల ప్రత్యేక అధికారి డీసీఓ విజయకుమార్, తహసీల్దార్ విల్సన్ బెన్నీలు తెలిపారు.

## నేడు ప్రజాపాలన జరిగే ప్రాంతాలివే..

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం మూడో రోజుకు చేరింది. శనివారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2, 14, 15, 16 డివిజన్లు, రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, ఈర్లపుడి, కామంచికల్, కోయచలక, హరియాతండా, పువ్వాడనగర్ పంచాయతీల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందు కోసం ఆయా డివిజన్‌లలో ఏర్పాటు చేసిన లోకేషన్లు, టీమ్ లీడర్ల వివరాలను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి వెల్లడించగా.. రఘునాథపాలెం మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు పంచాయతీలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో మూడు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురం పాఠశాలలో టీమ్ లీడర్ సీహెచ్.స్వామి(9849906095), 14వ డివిజన్‌లో కొత్తగూడెం స్కూల్‌లో వి.రంజిత్(7995075408), గొల్లగూడెం స్కూల్ లో బి.సత్యనారాయణ(9550615505), మధురనగర్ రోడ్ నం. 11లో ఎ.క్రిష్ణాలాల్(9849903607) ఆధ్వర్యాన దరఖాస్తులు స్వీకరించనున్నారు. అలాగే 15వ డివిజన్ అల్లీపురం ప్రాథమిక పాఠశాలలో సీహెచ్.సురేష్‌బాబు(9502812588), రుద్రమకోట స్కూల్‌లో కె.వికాస్(8008661119), పుట్టకోట హైస్కూల్‌లో టి.ధరణికుమార్(7780587720), 16వ డివిజన్ ధంసలాపురం కాలనీలో ఎం.రామారావు(9441748321), అగ్రహారం ప్రైమరీ స్కూల్‌లో టి.రంగారావు(7901298205), కొత్తూరు ప్రైమరీ స్కూల్‌లో రంజిత్‌కుమార్(9182270695) ఆధ్వర్యాన దరఖాస్తులు స్వీకరించనున్నారు.

### పథకాలన్నింటికీ దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంఅర్బన్: ప్రజాపాలన సభలో ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వగడాల మల్లేశ్ సూచించారు. శుక్రవారం 14, 15 డివిజన్ కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం ఉన్నత పాఠశాలలో శనివారం ప్రజా పాలన సభ జరుగుతుందని తెలిపారు. అలాగే ఖమ్మంలో జనసేవాదళ్ కవాతు బహిరంగ సభ నిర్వహించబడుతుందన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 14, 15 డివిజన్ల కార్యదర్శులు ప్రతానవు రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, వగడాల అనంతరాములు, బుడిగె వెంకన్న, చింతకాయల లక్ష్మీనారాయణ, పొట్ట ప్రసాద్, జంగాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

### అర్చనకు నంది పురస్కారం



నంది అవార్డు అందుకుంటున్న అర్చన

ఖమ్మంఅర్బన్: ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో గురువారం రాత్రి పలువురికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన ముంజాల అర్చన నాట్యంలో అద్భుతమైన ప్రతిభ కనబర్చినందుకు గాను బంగారు నంది పురస్కారంతో సన్మానించారు. తొమ్మిది రాష్ట్రాల్లో పలు వేదికలపై శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చినందుకు ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్‌తోనే దివ్యాంగుల పెన్షన్



ఎమ్మార్పీఎస్ నాయకుడిని సన్మానిస్తున్న దివ్యాంగులు

తిరుమలాయపాలెం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనల ఫలితంగానే నేడు దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మార్పీఎస్ డివిజన్ నాయకుడు చింతిరాల నాగభూషణం అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో దివ్యాంగులు నాగభూషణంను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రస్తుతం దివ్యాంగులకు రూ.4 వేలు పెన్షన్ సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్, విద్యాంగుల హక్కుల పోరాట సమితికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షురాలు అజ్మీర భారతి, పగిడిపల్లి బాబుమాదిగ, ఎస్‌కె.సైదాబీ వీరభద్రం, సీత, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.